ఆమెని
ప్రేమించి అతను
అతనిని
ప్రేమించి ఆమె
సమాంతరేఖలుగా
ఎలా మిగిలిపోయారు?

# ఉండనీ మనసులో

కోరుకొండ సత్యానంద్
కథ

హార్షిత అందమైనదే కాదు, తెలివైందికూడా. డిగ్రీలో నాది జువాలజీ గ్రూపు. ప్రాక్టికల్ క్లాసులో సీటింగ్ అరేంజ్‌మెంట్ ఆల్ఫాబీటికల్‌గా వుంటుంది. నాపేరు హరి కాబట్టి నీ సీటెప్పుడూ హర్షితకు ముందో, వెనుకో పడేది. హర్షిత డిసెక్షన్లు బాగా చేస్తుంది. నెర్వస్ సిస్టమ్ డిసెక్షన్ చేసేటప్పుడు నా స్పెసిమన్లో ఏ నెర్వ్ అయినా తెగిపోతే ఆమె వెంటనే మరో స్పెసిమన్ చేసి నాకిచ్చి హెల్ప్ చేసేది అప్పుడప్పుడూ. ప్రాక్టికల్ క్లాసులో మాట్లాడుకోడానికి ఎక్కువ అవకాశం వుండడంవల్ల, ఆమెపట్ల నేను క్రమక్రమంగా ఆకర్షితుడనవుతుండడంవల్ల ఏమాత్రం అవకాశం వచ్చినా నేను హర్షితతో మాట్లాడేవాడ్ని. హర్షితకూడా నాతో బాగా మాట్లాడేది. ఆమె మాటలకంటే మెత్తగా వుండే ఆమె గొంతే నన్నెక్కువగా ఆకర్షించేది.

ముందు కాలేజీ విషయాలు, తర్వాత సబ్జెక్ట్ విషయాలు... రికార్డులు, నోట్సులు ఇచ్చి పుచ్చుకోవడాలు... డిగ్రీ ఫైనలియర్ స్వంత విషయాలు మాట్లాడుకునేవరకూ వచ్చింది. మా పరిచయం. ఆమెతో చెప్పలేదుగానీ ఆమె నా మనసుని పూర్తిగా ఆక్రమించుకుంది. కాలేజీకి సెలవొస్తేచాలు నాకేదో దిగులుగా వుండేది. ఆమె నాతో మాట్లాడే విధానాన్ని గమనించిన నాకు నేనంటే ఆమెకూ అదే అభిప్రాయం వుండొచ్చని అనుకునేవాడ్ని. అది నిజమైతే బాగుండేదని ఆశపడేవాడ్ని.

డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు మొదలయ్యాయి. ఆమె ఆలోచనల్లో పడి పరీక్షలెక్కడ



పాడవుతాయోనని భయపడిన నేను ఆఖరు పరీక్షనాడు నా మనసు విప్పి, ఆమె మనసుని తెలుసుకోవాలని నిర్ణయించుకుని... ఆమె గురించిన ఆలోచనలను ప్రక్కన పెట్టి పూర్తిగా చదువులో పడిపోయాను.

ఆఖరు పరీక్ష అయిపోయిన రోజున ఆమెతోపాటు నేనూ పరీక్షహాల్లోనుంచి బయటకు వచ్చాను. ఆమె ఆరోజు పరీక్ష

గురించి మాట్లాడుతోంది. నేను వింటున్నా ను గానీ ఆమెతో నా మనసులోని విషయా న్ని చెప్పే అవకాశంకోసం ఎదురుచూస్తున్నా ను.

అంతలో ఆమె అంది... "డిగ్రీ అయిపో యాక ఏం చేద్దామనుకుంటున్నారు? ఉద్యో గ ప్రయత్నమా లేక యూనివర్శిటీ చదువా ?"

అది డిగ్రీ రిజల్టుబట్టి వుంటుంది. అప్పుడుకూడా నేనేం చేయాలనుకునేదీ" ఒక్క క్షణం ఆగి "మీ నిర్ణయం బట్టి వుంటుంది" చటుక్కున అనేశాను.

నా నిర్ణయమా, అదేమిటి?" ఆశ్చర్యం గా అడిగింది హర్షిత.

చెప్తాను. కాంటీన్‌కు వెళ్లి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం, రండి..." అని కాంటీ న్‌వైపుకి దారితీశాను. ఆమె నన్నుసరించిం ది.

టీ సిప్ చేస్తూ... "ఏమిటది, చెప్పండి' ' అని అడిగింది హర్షిత. ఆమె ఇప్పుడు సరదాగా కాదు, కాస్త సీరియస్‌గా వుందనిపి ంచింది. అయితే నన్ను అమితంగా ఆకర్షించే ఆ గొంతులోని మెత్తదనం మాత్రం అలాగే వుంది.

"మీతో పరిచయం నా కాలేజీ జీవితాన్ని ఆనందమయం చేసింది. మీరు అవకాశం ఇస్తే మిగతా జీవితాన్ని మీతో పంచుకోవాల ని వుంది" ఇంకా బాగా చెప్పి వుండాల్సింది అని అన్పించింది అలా అన్నతర్వాత.

కాసేపు ఆమె ఏమీ అనలేదు. మౌనంగా టీ కప్పువైపే చూస్తూ వుండిపోయింది. ఆ తర్వాత నావైపు చూసింది.

"హరీ... అయాం సారీ అని ఒక్క మాట అనేస్తే దాన్ని మీరు తట్టుకోలేరని నేనూహించగలను. కానీ అనక తప్పదు. మీరు నా పట్ల ప్రేమను పెంచుకుంటున్నా రని చాన్నాళ్ల క్రిందటే గ్రహించగలిగాను. దాన్ని అప్పుడే త్రుంచేస్తే బాగుండేదని ఎన్నోసార్లు అనుకున్నాను. కానీ నేనూ అలా చేయలేకపోయాను. ఎందుకంటే మీరంటే నాకూ అదోరకమైన ఇష్టం ఏర్పడింది. కానీ మనం కలసి బ్రతకలేము. నేను డిగ్రీలో జాయినైనప్పుడే నాకు దగ్గరి సంబంధం సెటిలైపోయింది. అతనిప్పుడు ఇంజనీరింగ్ ఫైనలియర్ చేస్తున్నారు. వచ్చే సంవత్సరం మా ఇద్దరికీ పెళ్లి జరుగుతుంది. ఆమె ఇంకా అలా ఏవో చెప్తూనే వుందిగానీ ఆ మాటలు నాకు విన్పించడంలేదు. నా మెదడు మొద్దుబారిపోతున్నట్లనిపించింది.

"హరీ..." ఆమె కాస్త గట్టిగా పిలిచిన ట్టుంది. ఉలిక్కిపడి తేరుకున్నాను.

"అప్సెట్ అవుతున్నారా? మీతో పరిచ యం పెంచుకుని, ఎంతో సన్నిహితంగా మాట్లాడి మీలో ఆశలు రేపినందుకు, వాటిని త్రుంచేస్తున్నందుకు రియల్లీ అయా ం వెరీ సారీ. కానీ ఒక్కమాట. ప్రేమ మానసికం. పెళ్లి సాంఘికం అయితే పెళ్లిచే సుకుని నా మనసుని నా భర్తకే అంకితం చేయకతప్పకపోయినా ... నా మనసులో ఓ మూల జీవితాంతం 'హరి' అనే పేరు వుండిపోతుందని మాత్రం చెప్పగలను. మీ ప్రేమకు ఇంతకంటే ఎక్కువ అవకాశం ఇవ్వలేకపోతున్నందుకు నన్ను మన్నించండి"

ఆ మాటలు విని నేనామెవైపే చూస్తూ వుండిపోయాను. మరో ఐదు నిమిషాల

తర్వాత... ''మరి వెళ్దామా?'' అంది లేచి నిలబడుతూ.

అచేతనంగా నేనామెను అనుసరించాను.

◇ ◆ ◇

నాకు మొట్టమొదటి ట్రాన్స్‌ఫరు రాజమండ్రికి అయింది. నేను జాయిన్ అయిన తర్వాత న్యూ రిక్రూట్‌మెంట్‌లో సెలెక్ట్ అయి మా బ్రాంచికి పోస్టింగ్ చేయబడ్డ 'శ్రీలత'ను నాకు అసిస్టెంట్‌గా వేశారు.


కాలేజీనుండి వచ్చిన అమ్మాయి కాబట్టి మా ఆఫీసుగురించి, చేయాల్సిన పనులగురించి ఏమీ తెలియదు. ఫండమెంటల్స్‌నుండి చెప్పవలసి వచ్చింది. అయితే శ్రీలత తెలివైన అమ్మాయి కాబట్టి నాకు పెద్దగా ఇబ్బంది కలగలేదు. ఒకసారి చెప్పిన విషయం మరలా చెప్పాల్సిన అవసరం కలగలేదు. అయితే క్యాష్‌కి సంబంధించిన స్టేట్‌మెంట్స్ మాత్రం నాకు చూపించకుండా ఫైనలైజ్ చేయొద్దనిమాత్రం చెప్పేవాడిని.

ఆరు మాసాల్లో శ్రీలత స్వతంత్రంగా పనిచేసుకునే స్థితికి ఎదిగింది. ఎప్పుడో తప్ప ఆఫీసు పనిగురించి నన్నేమీ అడిగేది కాదు. ఆఫీసులో పనిలేనప్పుడు శ్రీలత తన చిన్ననాటి విషయాలు.... స్కూలు, కాలేజీ విషయాలు చెప్తుండేది. చెప్పేది మామూలు విషయమేఅయినా వినాలన్పించేలాచెప్పేది.

అప్పుడప్పుడు కాలేజీలో తన వెంటపడే అబ్బాయిలగురించి, వాళ్లకు తను చెప్పే సమాధానాల గురించి కూడా చెప్పేది. నేను చిన్నగా నవ్వుతూ వినేవాడిని. శ్రీలత మాట్లాడుతున్నప్పుడు మధ్యమధ్యలో నావైపు అదోలా చూస్తుంది ఈ మధ్య. ఎందుకలా చూస్తుందో, ఆ చూపుకు అర్థం ఏమిటో నాకైతే అర్థమయ్యేది కాదు. నేనెప్పుడైనా లీవు పెడితే నేనొచ్చింతర్వాత ముఖం వాచిపోయిందాన్లా మాట్లాడేది.

''మీరు లేక నాకు ఈ రెండు రోజులూ భలే బోరు కొట్టిందండీ'' అనేది.

ఒకసారి శ్రీలత అలా అన్నప్పుడు...



"ఒకవేళ నీకుగానీ, నాకుగానీ ట్రాన్స్‌ఫ రైతే ఏం చేస్తావు?" అని అన్నాను మామూలుగా.

ఒక్క క్షణం శ్రీలత ముఖంలో అదోలాంటి భావం కదలాడింది. నా కళ్లలోకే చూస్తూ... "అలా జరిగితే ఏం చేస్తావో... ఓ ఆర్నెల్లు పోయాక చెప్తాను" అంది.

"ఆర్నెల్లలోగానే మనిద్దరిలో ఎవరో ఒకరికి ట్రాన్స్‌ఫరైపోతే?" నవ్వుతూ అన్నాన్నేను.

"రిలీవ్ అయ్యేరోజున చెప్తాను" అంది. ఆ తర్వాత వేరే మాటల్లో పడిపోయాం.

మరో ఆర్నెల్లకు శ్రీలత ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయినట్టు, ఆమెను పర్మెనెంట్ చేస్తున్నట్టు ఆర్డర్స్ వచ్చాయి. అవి నా టేబుల్‌కు వచ్చాయి. ఓ అరగంట శ్రీలతను సస్పెన్స్‌లో ముంచెత్తి ఆఖర్న చెప్పాను. శ్రీలత చాలా ఆనందపడింది.

ఆరోజు సాయంత్రం బ్రీఫ్‌కేసు సర్దుతుంటే 'నాదో రిక్వెస్టు' అంటూ నా సీటు దగ్గరకు వచ్చింది శ్రీలత.

"ఏమిటి?" అని అడిగేను నేను.

"రేపు మీరు మాఇంటికి రావాలి" అంది.

"ఎందుకు?"

"డిన్నర్‌కి..."

"ఇప్పుడెందుకు శ్రీలతా?"

"నా ప్రొబెషన్ డిక్లేర్ అయిందిగా. అందుకు. నా సంతోషం కోసం"

"రేపు ఆఫీసులో అందరికీ స్వీట్సు, డ్రింక్సు ఇస్తున్నావుగా. మళ్లీ డిన్నర్ ఎందుకు?"

"అందరూ వేరు. మిమ్మల్ని ప్రత్యేకంగా పిలుస్తున్నాను. కాదంటే ఫీలవుతాను"

సరే అనక తప్పలేదు. మర్నాడు శ్రీలత ఇంటికి వెళ్లాము. ఇంటిల్లిపాదీ నన్నెంతో అభిమానంగా, గౌరవంగా చూశారు. శ్రీలత అయితే చాలా హడావుడి చేసింది. దగ్గరుండి ఎంత వారించినా రకరకాల ఐటమ్స్ నాచేత బలవంతంగా తినిపించింది. భోజనం అయిన తర్వాత అరగంటకుగానీ భుక్తాయాసం తీరిందికాదు. అప్పుడుగానీ నేను ఇంటికి బయల్దేరలేకపోయాను.

గేటువరకూ తోడొచ్చింది శ్రీలత. గేటుదాటి 'వెళ్లొస్తా'నని చెప్పాను.

"రేపు ఆఫీసుకి వస్తున్నారుకదా?" అని అడిగింది.

"ఆ... వస్తున్నాను" అని చెప్తుండగా శ్రీలత నా చేతికో కవరు అందించింది.

"ఏమిటిది?"

"లంచం కాదులెండి. నా హృదయం. చదివి రేపు ఆఫీసులో మీ అభిప్రాయం చెప్పండి" అని గేటు గెడ వేసుకుని లోపలికి వెళ్లిపోయింది.

వెళ్లిపోతున్న శ్రీలతవైపు, నాచేతిలో ఉన్న కవరువైపు మార్చి మార్చి చూసి అక్కడ్నుంచి కదిలాను.

◇ ◆ ◇

లంచవర్లో అన్యమనస్కంగా కాంటీన్లో కూర్చుంటే శ్రీలత వచ్చి నా ఎదురుగా కూర్చుంది. ఒక్క క్షణం ఆమెవైపు చూశాను.

"నేనిచ్చిన కవరు... చదివారా?"

నెమ్మదిగా తలూపాను నేను.

"మీ సమాధానంకోసమే ఎదురుచూస్తు

న్నాను...''

"ఎలా చెప్పాలా అని నేనూ ఆలోచిస్తున్నాను...''

"... ఆలోచిస్తున్నారా...?'' అని అడిగి ఆగిపోయింది శ్రీలత.

"... నీ ఉత్తరం చదివాను. నీ మనసు తెలుసుకున్నాను. కానీ ఆలస్యం అయిపోయింది''

"అంటే...?''

"ఏమీ లేదు. నువ్వు జాయినయ్యే ముందు నాకు మాచ్ ఫిక్స్ అయింది. ఆమె వైజాగ్‌లో పీజీ చేస్తోంది. ఈ సంవత్సరం చివర్లో మా పెళ్లి జరుగుతుంది. ఈ విషయం ఆఫీసులో ఎవరికీ తెలీదు. నీక్కూడా చెప్పాలని ఎప్పుడూ అనుకోలేదు''

శ్రీలత ముఖం చూస్తుంటేనే నాకు అర్థమైంది. ఆమె ఎంతవిలవిల్లాడుతుందో.

కానీ నేను చేయగలిగేదేముంది. బాధపడొద్దని మాత్రం చెప్పి ఊరుకున్నాను. లంచవరు అయిపోతుందనగా ఆఫీసుకి వెళ్లడానికి లేవబోతుంటే శ్రీలత ఒక్క క్షణం ఆగమంది నన్ను. ఆగాను.

"మనసిచ్చిన నేను మీ దాన్ని కాలేకపోతున్నాను. అయినా ఆశచావక అడుగుతున్నాను ప్రేమించిన నేనెలాగూ మిమ్మల్ని మరచిపోలేను. మీరు, మీ మనసు మీ భార్యకే స్వంతం అయినా... 'శ్రీలత అనే నన్ను' ఎప్పటికీ మీ మనసులో వుండనీగలరా? మిమ్మల్ని ప్రేమించి వ్యక్తిగా గుర్తుంచుకోగలరా?''

నేనేమీ మాట్లాడలేకపోయాను.

క్షణం తర్వాత శ్రీలతే అంది... 'మీనుంచి సమాధానం రాలేదు. అంటే నా అభ్యర్థనను మన్నించలేదా?'

"అబ్బే... అదేంకాదు శ్రీలతా...'' అప్పటి హర్షిత మాటలు చెవుల్లో గింగుర్లు పడుతుంటే "తప్పకుండా. నిన్నెప్పటికీ మరచిపోలేను. కానీ నీలో కలిగిన ఈ నిరుత్సాహాన్ని చాలా తక్కువ సమయంలో దూరం చేసుకుని... మామూలు మనిషివై జీవితంలో ఆనందంగా స్థిరపడినరోజునుండే 'శ్రీలత అనే నువ్వు' నా మనసులో వుండిపోతావు... సరేనా?'' అన్నాను నవ్వడానికి ప్రయత్నిస్తూ.

శ్రీలత కూడా నవ్వడానికి ప్రయత్నించింది!

◇ ◆ ◇

